క్లుప్తంగా

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



రోడ్ల పనులు ప్రారంభించిన బుచ్చిరాములు

సంగారెడ్డి టౌన్‌: మండలంలోని ఐరిగిపల్లి గ్రామంలో ఆదివారం రూ.23 లక్షలతో సీసీ రోడ్ల పనులను కాంగ్రెస్‌ పార్టీ మండల అధ్యక్షుడు బుచ్చి రాములు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చాలా రోజుల నుంచి గ్రామంలో రోడ్లు సరిగ్గా లేక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. సీసీ రోడ్లకు నిధులు మంజూరు కావడం సంతోషమన్నారు. నిధుల మంజూరుకు సహకరించిన మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామం మాజీ సర్పంచ్‌, మాజీ ఎంపీటీసీ కార్యకర్తలు పాల్గొన్నారు.

దాహార్తి తీర్చేందుకే చలివేంద్రం



చలివేంద్రాన్ని ప్రారంభించిన నాయకులు

పటాన్‌చెరు టౌన్‌: వేసవి నేపథ్యంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఉపయోగపడతాయని నవభారత్‌ నిర్మాణ యువసేన అధ్యక్షుడు శ్రీధర్‌, బాలాజీ ఫౌండేషన్‌ అధ్యక్షుడు బలరాంలు అన్నారు. ఆదివారం మండలం ఇంద్రేశంలో నవీన్‌కుమార్‌ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో నిర్వాహకులు నవీన్‌కుమార్‌, ఇంద్రేశం మాజీ ఉపసర్పంచ్‌ శివగౌడ్‌, మాజీ వార్డు మెంబర్‌ నాగరాజు, సాయిగౌడ్‌, మహేష్‌ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో ప్రయోజనం



లక్ష్మణ్‌ను సన్మానించిన ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్‌: సంక్షేమ పథకాలతో ప్రజలు లబ్ధి పొందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే సంజీవరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గతంలో కాంగ్రెస్‌ ప్రభుత్వం రాయితీపై రైతులకు వ్యవసాయ పరికరాలు అందించేది. కానీ, బీఆర్‌ఎస్‌ అధికారంలోకి వచ్చాక సబ్సిడీపై ఇచ్చే పరికరాలను నిలిపేసిందని మండిపడ్డారు. రైతుబంధు పేరిట వెంచర్లు, గుట్టలు, వందల ఎకరాలున్న రైతులకు పెట్టుబడి సహాయం అందించిందని ఆరోపించారు. తమ ప్రభుత్వం సాగుకు యోగ్యమైన భూములకే రైతుభరోసాను ఎకరాకు ఏటా రూ.12 వేలు ఇస్తుందని తెలిపారు. ఆత్మీయభరోసా కింద భూమిలేని కూలీలకు ఏటా రూ.12 వేలు అందజేస్తోందని చెప్పారు. అనంతరం కల్హేర్‌ మండలానికి చెందిన గుండు లక్ష్మణ్‌ పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన నేపథ్యంలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి శాలువా, పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ నాయకులు దారంశంకర్‌, రమేష్‌ చౌహాన్‌, తాహెర్‌ అలీ, ముంతాజ్‌ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేకు పరామర్శ

జిన్నారం (పటాన్‌చెరు): నర్సాపూర్‌ మాజీ ఎమ్మెల్యే సీహెచ్‌ మదన్‌రెడ్డి గుండె సంబంధిత శస్త్ర చికిత్స చేయించుకున్నాడు. ఆదివారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌ నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న మదన్‌ రెడ్డిని సీజీఆర్‌ ట్రస్ట్‌ చైర్మన్‌ రాష్ట్ర బీఆర్‌ఎస్‌ నాయకులు చిమ్ముల గోవర్ధన్‌ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ కుమార్‌ గౌడ్‌ పరామర్శించారు. రాజకీయంగా సుదీర్ఘ అనుభవం గల ఆయన త్వరగా కోలుకోవాలని భగవంతుడి ప్రార్థించారు.

ఉచిత వైద్య శిబిరం ప్రారంభం

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని వైయస్సార్‌ కాలనీలో ఆదివారం జగన్నాథ్‌ ఉత్కల్‌ సంస్కృతి సంఘం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. మాజీ కౌన్సిలర్‌ చంద్రారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద, కార్మికులకు కార్పొరేట్‌ స్థాయిలో ఉచిత వైద్యాన్ని అందించడం అభినందనీయమన్నారు. అనంతరం నిర్వాహకులు చంద్రారెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించారు.

వీధి కుక్కల వీర విహారం



జిన్నారం (పటాన్‌చెరు): గడ్డపోతారం మున్సిపాలిటీలోని వావిలాల గ్రామంలో రోజురోజుకు కుక్కల బెడద తీవ్రంగా తయారయింది. గుంపులు గుంపులుగా ఏర్పడి వీరవిహారం చేస్తున్నాయని అన్నారు. రాత్రి సమయంలో రోడ్లపై నడవాలంటే ప్రాణాలు అరిచేతిలో పెట్టుకొని వెళ్లాల్సిన పరిస్థితి దాపురించిందని వాపోయారు. కుక్కల బెడద నుంచి అధికారులు కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

వేధిస్తున్న సిబ్బంది కొరత

- సెలవుల్లో ఎస్‌ఐ.. ఏఎస్‌ఐకు అదనపు బాధ్యతలు
- నాలుగు హెడ్‌కానిస్టేబుల్స్‌, ఒక ఏఎస్‌ఐ, 13 కానిస్టేబుల్స్‌ పోస్టులు ఖాళీ
- తీవ్ర ఒత్తిడిలో వట్‌పల్లి పోలీస్‌ సిబ్బంది



వట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌

వట్‌పల్లి(అందోల్‌): వట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో సిబ్బంది కొరత వేధిస్తుంది. 2016లో వట్‌పల్లి నూతన మండల ఏర్పాటు సమయంలో పోలీస్‌స్టేషన్‌లో ఒక ఎస్‌ఐ, ఇద్దరు ఏఎస్‌ఐలు, నలుగురు హెడ్‌ కానిస్టేబుల్స్‌, 21 మంది కానిస్టేబుల్స్‌తో కలిసి మొత్తం 28 మంది సిబ్బందిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కాని, గడిచిన తొమ్మిదేళ్లలో ఏనాడు పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించిన దాఖలాలు లేవు. కొందరిని ఇక్కడి నుంచి ఇతర పోలీస్‌స్టేషన్‌లకు డిప్యూటేషన్‌పై పంపడంతో సిబ్బంది కొరత కొనసాగుతూనే ఉంది. పల్లెల్లో చోటు చేసుకునే సమస్యలపై స్పందించేవారు కరువయ్యారు. ప్రస్తుతం ఒక ఏఎస్‌ఐ, 8 మంది సిబ్బంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ఇలా అరకొర సిబ్బందితో ఉన్నవారిపై పని భారం పడుతోంది. దీంతో పలు సమస్యలతో వచ్చే ప్రజలకు సకాలంలో న్యాయం అందించే పరిస్థితి లేకుండా పోయింది. కేసులు నమోదు చేయాల్సి వస్తే స్టేషన్‌హౌస్‌ ఆఫీసర్‌గా ఉన్న ఏఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టాల్సి పరిస్థితి ఏర్పడింది. ఉన్నతాధికారులు స్పందించి వట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌కు సరిపడా సిబ్బందిని నియమించాల్సిన అవసరం ఉందని మండల ప్రజలు కోరుతున్నారు.

స్టేషన్‌ పరిస్థితి ఇలా..

పోలీస్‌స్టేషన్‌ పరిధిలో 21 గ్రామ పంచాయతీలు, మండల మొత్తంగా 35 వేల వరకు జనాభా ఉంది. స్టేషన్‌లో ఒక ఎస్‌ఐ, ఇద్దరు ఏఎస్‌ఐలు, నలుగురు హెడ్‌ కానిస్టేబుల్స్‌, 21 మంది కానిస్టేబుల్స్‌ ఉండాల్సి ఉండగా ఒక ఎస్‌ఐ, ఏఎస్‌ఐ , 8 మంది సిబ్బంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ఉన్న కానిస్టేబుల్స్‌ సిబ్బందిలో ఒకరూ డీఎస్పీ ఆఫీస్‌లో, మరొకరు కోర్టులో విధులు నిర్వహిస్తున్నారు. ఇద్దరు రెగ్యులర్‌గా స్టేషన్‌ వాచ్‌డ్యూటీ ఉంటుంది. మిగిలిన నలుగురు సిబ్బంది మండలంలో శాంతి భద్రతల విధులతో పాటు ఇటు ప్రముఖుల బందోబస్తు, పెట్రోలింగ్‌ విధులు నిర్వహించాల్సి వస్తుంది. జీబ్‌ డ్రైవర్‌గా ఉన్న ఒక హోంగార్డు ఇటీవల గొర్రెకల్‌ గ్రామంలో వాహనాన్ని ప్రైవేట్‌ వ్యక్తికి ఇవ్వడంతో డ్రైనేజీలో ఇరికించాడనే ఆరోపణతో అతనిని సస్పెండ్‌ చేసినట్లు తెలిసింది. స్టేషన్‌లో కనీస సిబ్బంది లేకపోవడంతో సమస్యల పరిష్కారం సైతం మందకొడిగా జరుగుతుందని ప్రజలు వాపోతున్నారు.

కనిపించని గ్రామపోలీసు..

గతంలో ప్రతి గ్రామానికి ఓ పోలీసు అధికారిని అధికారుల ఆదేశాల మేరకు ఏర్పాటు చేశారు. దీంతో పల్లెల్లో ఎలాంటి చిన్న సమస్య వచ్చినా గ్రామాధికారులు పరిష్కరించేవారు. సిబ్బంది కొరతతో గ్రామపోలీసు అధికారులు లేకుండా పోయారు. ప్రతి చిన్న సమస్యకు ప్రజలు మండల కేంద్రంలోని స్టేషన్‌కు తప్పడం లేదు. ఇది ఇలా ఉండగా ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వం పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తే సమస్య మరింత తీవ్ర రూపం దాల్చే అవకాశం ఉంది. స్థానిక ఎన్నికల సమయంలో అనుకోని సంఘటనలు జరిగితే మాత్రం అనేక రకాల ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉంది.

సీఎంను కలిసిన టీపీసీసీ సభ్యుడు



నారాయణఖేడ్‌: టీపీసీసీ సభ్యులు కర్నె శ్రీనివాస్‌ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. తన పుట్టిన రోజును పురస్కరించుకొని కర్నె శ్రీనివాస్‌ సీఎంకు తెలుగు అక్షరమాలతో ప్రత్యేకంగా తయారు చేసిన సీఎం చిత్రం పెయింటింగ్‌ను బహూకరించారు. అక్షరమాలలోని అన్ని అక్షరాలతో తన చిత్రం వేయడంపై సీఎం రేవంత్‌రెడ్డి శ్రీనివాస్‌ను అభినందించారు. ఖేడ్‌ అభివృద్ధికి కృషి చేస్తానని సీఎం భరోసా ఇచ్చినట్లు శ్రీనివాస్‌ తెలిపారు.

ముఖ్యమంత్రి చిత్రాన్ని బహూకరిస్తున్న శ్రీనివాస్‌

సేవా కార్యక్రమాలతోనే గుర్తింపు

టీజీఐఐసీ చెర్మ్‌ పర్సన్‌ నిర్మలారెడ్డి



బోరుమోటార్‌ను ప్రారంభిస్తున్న నిర్మలారెడ్డి

కంది(సంగారెడ్డి): సేవా కార్యక్రమాలతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని టీజీఐఐసీ చెర్మ్‌ పర్సన్‌ నిర్మలారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని చెర్లగూడెంలో ఎలిమెల నాగిరెడ్డి చారిటబుల్‌ ట్రస్ట్‌ అధినేత, కాంగ్రెస్‌ నాయకుడు సుధాకర్‌ రెడ్డి ఏర్పాటు చేసిన బోరు, చలివేంద్రాన్ని నిర్మలారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు బోరు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రభుత్వం గ్రామాల్లో నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపడుతోందని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్‌ విజయలక్ష్మి, కాంగ్రెస్‌ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆంజనేయులు, బ్లాక్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడు రఘుగౌడ్‌, సీపీసీఎస్‌ చెర్మన్‌ ప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్‌ పార్టీ మండల అధ్యక్షుడు మోతీలాల్‌ నాయక్‌ తదితరులు పాల్గొన్నారు.

మనిషి సహజ స్వభావం వీడొద్దు



శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

జహీరాబాద్‌ టౌన్‌: అన్ని సౌకర్యాలు ఉన్నా మనిషి జీవన విధానాన్ని నిర్మించుకోలేకపోతున్నాడని కంది ఇస్కాన్‌ ప్రతినిధి విభీషణ్‌ ప్రభు అన్నారు. హరే కృష్ణ ఆధ్వర్యంలో పట్టణంలోని హమాలీ కాలనీలో ఆదివారం 147వ నగర సంకీర్తన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విభీషణ్‌ ప్రభు భక్తులనుద్దేశించి మాట్లాడారు. మనిషి తన సహజ స్వభావాన్ని వీడుతున్నాడని.. ఇలా చేయడం వల్ల అనుకున్న లక్ష్యాన్ని చేరుకోలేకపోతున్నాడని విచారం వ్యక్తం చేశారు. పశు పక్షాదులు ప్రకృతికి అనుగుణంగా జీవిస్తుంటే మేధస్సు, విజ్ఞానం కల్గిన మనిషి విరుద్ధంగా నడుచుకుంటున్నాడని తెలిపారు. కావున, ఆధ్యాత్మిక చింతన అలవచ్చుకోవాలన్నారు. జన్మదినం, వార్షికోత్సవాలు జరుపుకొంటున్న జంటలకు శుభాకాంక్షలు తెలిపారు. అంతకుముందు నగర సంకీర్తనలో భాగంగా భక్తులు శోభాయాత్ర నిర్వహించి కృష్ణ కీర్తనలు ఆలపించారు.

రాజ్యాంగ పరిరక్షణకు నడుం బిగించాలి

కాంగ్రెస్‌ నేత నీలం మధు



డీసీసీ అధ్యక్షురాలు నిర్మలతో నీలం మధు

పటాన్‌చెరు: స్వాతంత్ర సమరయోధులను అవమానిస్తూ అంబేడ్కర్‌ రచించిన రాజ్యాంగాన్ని అవమానించేలా కేంద్రంలోని బీజేపీ సర్కార్‌ ప్రవర్తిస్తుందని కాంగ్రెస్‌ నేత నీలం మధు మండిపడ్డారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కుందన్‌ హాల్‌లో డీసీసీ అధ్యక్షురాలు నిర్మల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ''జై బాపు – జై భీమ్‌ – జై సంవిధాన్‌ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ.. అహింస పద్ధతిలో పోరాటం చేస్తూ ప్రపంచానికి ఆదర్శంగా నిలిచి స్వాతంత్య్రం సాధించిన మహాత్మాగాంధీతో పాటు ప్రజల స్వేచ్ఛ సమానత్వం కోసం రాజ్యాంగాన్ని రచించిన అంబేద్కర్‌లను బీజేపీ ఆర్‌ఎస్‌ఎస్‌ అవమానిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంట్‌ సాక్షిగా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌ షా అంబేద్కర్‌ వ్యతిరేకంగా చేసిన వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనమన్నారు. రాజ్యాంగాన్ని పరిరక్షించడానికి కాంగ్రెస్‌ పార్టీ అగ్రనేత రాహుల్‌ గాంధీ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌ పార్టీ దేశవ్యాప్తంగా 'జై బాపు – జై భీమ్‌ – జై సంవిధాన్‌' అభియాన్‌ ర్యాలీ నిర్వహిస్తున్నారని తెలిపారు. గ్రామ గ్రామాన ఈ పాదయాత్ర చేయాలని సమావేశంలో పిలుపునిచ్చారు.

ఆత్మీయతకు ప్రతీక ఇఫ్తార్‌



ప్రార్థన చేస్తున్న ఎమ్మెల్యే, ముస్లింలు

సంగారెడ్డి: రంజాన్‌ను పురస్కరించుకొని దుబాయ్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌ విందులో ఆదివారం ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ముస్లిం సోదరులకు రంజాన్‌ శుభాకాంక్షలు తెలుపుతూ సోదరా భావంతో కూడిన ఆత్మీయతకు ఇఫ్తార్‌ విందు ప్రతీకమని అన్నారు. కార్యక్రమంలో ముస్లిం మాత పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ ఆధ్వర్యంలో..

వట్‌పల్లి(అందోల్‌): పవిత్ర రంజాన్‌ మాసాన్ని పురస్కరించుకొని అందోల్‌ మండలంలోని కన్‌సాన్‌పల్లి గ్రామంలో ఆదివారం కాంగ్రెస్‌ పార్టీ ఆధ్వర్యంలో ఇఫ్తార్‌ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉపావాస దీక్ష చేపట్టిన ముస్లిం సోదరులకు ఫలహారాలు తినిపించి ఉపవాస దీక్షలు విరమింపజేశారు. మండల కాంగ్రెస్‌ యువజన అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్‌ మాట్లాడుతూ.. ఇఫ్తార్‌ విందు ఆత్మీయత, మత సామరస్యానికి ప్రతీక అన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ డైరెక్టర్‌ శేరి వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ బాలయ్య, నాయకులు మహిపాల్‌, రమేష్‌గౌడ్‌, నర్సింలు, వెంకయ్య, సత్తయ్య, షాందమియా పాల్గొన్నారు.

క్యాంపు కార్యాలయంలో..

జహీరాబాద్‌ టౌన్‌: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు ముస్లిం సోదరులకు ఇఫ్తార్‌ విందు ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రార్థనలు నిర్వహించి పండ్లు తినిపించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇఫ్తార్‌ విందు ఏర్పాటు సోదర భావాన్ని పెంచుతున్నాయన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్‌ ఉమ్మడి మెదక్‌ జిల్లా చైర్మన్‌ ఎం.శివకుమార్‌, బీఆర్‌ఎస్‌ పార్టీ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వవిద్యార్థులు

సంగారెడ్డి టౌన్‌: మండలంలోని సరస్వతీ శిశుమందిరంలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. 2011–12 బ్యాచ్‌ పదవ తరగతి విద్యార్థులు 12 ఏళ్ల తరువాత కలుసుకున్నారు. అనంతరం ఒకరికొక్కరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని సంతోషం వ్యక్తం చేశారు. గురువులకు నమస్కరిస్తూ వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానాచార్యులు నరసింహగౌడ్‌, గురువులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

దైవచింతనతో మానసిక ప్రశాంతత

కార్పొరేటర్‌ మెట్టు కుమార్‌యాదవ్‌



పూజల్లో పాల్గొన్న కార్పొరేటర్‌ కుమార్‌యాదవ్‌

పటాన్‌చెరు టౌన్‌: దైవచింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని కార్పొరేటర్‌ మెట్టుకుమార్‌ యాదవ్‌ అన్నారు. ఆదివారం డివిజన్‌ పరిధిలోని హిందూ సమాజసేవ నవయువక్‌ సంఘం వారి ఆధ్వర్యంలో శాంతినగర్‌ కాలనీలోని ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో 24 గంటల హరికీర్తన భజన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌ కుమార్‌యాదవ్‌ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. తెల్లాపూర్‌ మున్సిపల్‌ పరిధిలో నిర్మించనున్న పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి ఆలయ నిర్మాణానికి కుమార్‌యాదవ్‌ రూ.50 వేల విరాళం నిర్వాహకులకు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ సీనియర్‌ నాయకులు శ్రీధర్‌చారి, వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ అధ్యక్షుడు శ్రీశైలంచారి, గోపాల్‌చారి, ప్రకాష్‌చారి, భీమ్‌ లింగచారి తదితరులు పాల్గొన్నారు.

బోరంచను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దండి

ఎమ్మెల్యే సంజీవరెడ్డి



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్‌: నియోజకవర్గంలోని బోరంచ నల్ల పోచమ్మ ఆలయ ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే సంజీవరెడ్డి కోరారు. శనివారం అసెంబ్లీలో జీరో అవర్‌లో ఆయన మాట్లాడారు. కర్ణాటక, మహారాష్ట్రల సరిహద్దులో మంజీరా నదీతీరాన నల్లపోచమ్మ ఆలయం ఉంది. నిత్యం 2 వేల మంది.. తిరునాళ్ల సమయంలో 2 లక్షల మంది భక్తులు వస్తుంటారని తెలిపారు. సమీపంలోనే 500 ఏళ్ల కిందట నిర్మించిన సంగమేశ్వర ఆలయం, అటవీప్రాంతంతో పాటు 100 ఎకరాల వరకు ప్రభుత్వ భూమి ఉంది. బసవేశ్వర ఎత్తిపోతల పథకం ఈ ప్రాంతంలోనే నిర్మిస్తున్నారని చెప్పారు. అందోల్‌ నియోజకవర్గం సైతం దగ్గరగా ఉండి రెండు నియోజకవర్గాలకు మేలు జరిగేలా అభివృద్ధి చేయడానికి అన్నివిధాలుగా అనుకూలంగా ఉందని వివరించారు. రాష్ట్ర పర్యాటక శాఖమంత్రి జూపల్లి కష్ణారావు సమాధానమిస్తూ విషయాలన్నీ నోట్‌ చేసుకున్నామని తప్పకుండా పరిశీలించి ఏర్పాట్లు చేస్తామన్నారు.

వాటర్‌షెడ్‌ ప్రయోజనాలపై అధ్యయనం



షెడ్‌ ఫలితాలు తెలుసుకుంటున్న బృందం

జహీరాబాద్‌: కోహీర్‌ మండలంలోని గొటిగార్‌పల్లి వాటర్‌షెడ్‌ ప్రయోజనాలను మాజీ మంత్రి మర్రి శశిధర్‌ రెడ్డి బృందం పరిశీలించింది. ఆదివారం వారు గ్రామంలో పర్యటించారు. 2001లో సిమెంట్‌ వినియోగం లేకుండా జలవనరుల ఇంజనీర్‌ హన్మంతరావు సూచనలతో చేపట్టిన పనులు నేడు మంచి ఫలితాలు ఇస్తున్నాయని శశిధర్‌ రెడ్డి వివరించారు. మహారాష్ట్రతో పాటు పలు ప్రాంతాలక చెందిన నిపుణులు అధ్యయనం చేసేందుకు వచ్చారన్నారు. వారికి వాటర్‌ షెడ్‌ ఫలితాలను చూపించేందుకు తీసుకువచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో మహారాష్ట్ర వాటర్‌ షెడ్‌ చీఫ్‌ ఇంజనీర్‌ విజయ్‌ దేవ రాజ్‌, హైదరాబాద్‌ అగ్రికల్చరల్‌ యూనివర్సిటీ ప్రతినిధి నాయర్‌, ఆయా శాఖల అధికారులు కృష్ణ తేజ, రజనీ, అధ్యయన విద్యార్థులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్‌ ఆశయ సాధనకు కృషి



భగత్‌సింగ్‌ చిత్రపటాలతో ర్యాలీ చేస్తున్న నాయకులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): భగత్‌సింగ్‌ వర్ధంతిని పురస్కరించుకుని సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం బైక్‌ ర్యాలీ నిర్వహించారు. అనంతరం బీరంగూడ కమాన్‌ వద్ద ఏర్పాటు చేసిన సభలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాజయ్య మాట్లాడుతూ.. భగత్‌సింగ్‌ ఆశయాలను సాధనకు కోసం యువత పోరాడాలని పిలుపునిచ్చారు. సోషలిజంతోనే సమస్యలు పరిష్కారమవుతాయని భగత్‌సింగ్‌ చెప్పేవారని ఆయన గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు నాగేశ్వరరావు, పాండురంగారెడ్డి, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలతోనే విముక్తి

సదాశివపేట (సంగారెడ్డి): భగత్‌సింగ్‌ స్ఫూర్తి పోరాటాలకు ప్రజలు సిద్ధం కావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు అతిమేల మాణిక్‌ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలో భగత్‌సింగ్‌ 94 వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటాలతో బస్టాండ్‌ వరకు ర్యాలీ నిర్వహించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఎం నాయకులు ప్రవీణ్‌కుమార్‌, నర్సింలు, రాజు, భూషణం, ఖయ్యూం, అంజయ్య, మహేశ్‌ పాల్గొన్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

మునిపల్లి(అందోల్‌): రేణుకఎల్లమ్మ అమ్మవారికి ఆలయ ధర్మకర్త కాదులూరి లక్ష్మీనర్సింహ్మాగౌడ్‌ కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం మండలంలోని మన్‌సాన్‌పల్లి గ్రామ శివారులోని ఎల్లమ్మ దేవాలయంలో 8వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమానికి మాజీ ఎంపీపీ రాంరెడ్డి, మాజీ జెడ్పీటీసీ మీనాక్షి సాయికుమార్‌, సీనియర్‌ కాంగ్రెస్‌ నాయకులు నర్సింహ్మాగౌడ్‌ వెంకటలక్ష్మారెడ్డి, కాంగ్రెస్‌ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **50 మందికి కంటి శస్త్ర చికిత్సలు**

నారాయణఖేడ్‌: ఖేడ్‌ ప్రాంతానికి చెందిన 50 మందికి హైదరాబాద్‌ నానక్‌రాంగూడలోని శంకర ఆస్పత్రిలో ఉచిత కాటారాక్ట్‌ శస్త్ర చికిత్సను విజయవంతంగా పూర్తి చేశారు. సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాల్లో భాగంగా సత్యసాయి సేవాసమితి, శంకర కంటి ఆస్పత్రి , జిల్లా అంధత్వ నివారణసంస్థ ఆధ్వర్యంలో ఈనెల 21న ఖేడ్‌లో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. 105 మందికి కంటి పరీక్షలు నిర్వహించి అందులో 51 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించి వారికి వాహన సదుపాయం ఏర్పాటు చేసి హైదరాబాద్‌కు తీసుకెళ్లి శస్త్ర చికిత్సలు చేసి ఆదివారం ఖేడ్‌కు తీసుకువచ్చారు.

◆ **రామకృష్ణకు డాక్టరేట్‌ ప్రదానం**



సదాశివపేట రూరల్‌(సంగారెడ్డి): మండలంలోని నిజాంపూర్‌(కే) ప్రాథమిక ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పోట్రు రామకృష్ణకు విద్య, సామాజిక సేవలకు ఇంటర్నేషనల్‌ పీస్‌ యూనివర్సిటీ జర్మనీ వారు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. ఆదివారం తమిళనాడులోని పాండిచ్చేరిలో షెన్‌బగ హోటల్‌ అండ్‌ కన్వెన్షన్‌ సెంటర్‌ జరిగిన కార్యక్రమంలో అవార్డు అందుకున్నారు. రామకృష్ణకు ఇది రెండవ గౌరవ డాక్టరేట్‌ 2022లో ద సౌత్‌ వెస్ట్రన్‌ అమెరికన్‌ యూనివర్సిటీ ద్వారా డాక్టరేట్‌ పొందారు. రామకృష్ణను ఎంఈఓ శంకర్‌, నోడల్‌ అధికారి సుధాకర్‌, నిజాంపూర్‌ కాంప్లెక్స్‌ ప్రధానోపాధ్యాయురాలు రాజశ్రీ, వివిధ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు.

◆ **సామూహిక హనుమాన్‌ చాలీసా**

వట్‌పల్లి(అందోల్‌): అందోల్‌ మండలంలోని కన్‌సాన్‌పల్లి గ్రామంలో భజరంగ్‌దళ్‌ ఆధ్వర్యంలో హనుమాన్‌ మందిరంలో ఆదివారం సామూహిక హనుమాన్‌ చాలీసా పారాయణం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విశ్వహిందూ పరిషత్‌ సంయోజక్‌ ఆంజనేయులు మాట్లాడుతూ.. హనుమంతుడు శ్రీరామ నామం జపిస్తేనే అనేక అద్భుతాలు సృష్టించాడని చేశాడని అన్నారు. హనుమాన్‌ చాలీసా పారాయణం వల్ల భక్తిభావం నెలకొంటుందన్నారు. కార్యక్రమంలో సహ ప్రముఖ్‌ రాకేష్‌గౌడ్‌, హనుమాన్‌దాసు, భజరంగ్‌దళ్‌ సభ్యులు శ్రీనివాస్‌, శ్రీశైలం, గోపాల్‌, భాగేష్‌, మాణిక్యం, ఆంజనేయులు, పాపయ్య, మశ్చందర్‌ తదితరులు పాల్గొన్నారు.

◆ **కార్మికవర్గంపై నిర్బంధం ఆపాలి**

నారాయణఖేడ్‌: కార్మికవర్గంపై ప్రభుత్వ నిర్బంధాన్ని ఆపాలని కేవీపీఎస్‌ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొటారి నర్సింహులు, సీఐటీయూ ఖేడ్‌ డివిజన్‌ కార్యదర్శి రమేష్‌ డిమాండ్‌ చేశారు. కార్మికుల సమస్యలపై శాంతియుతంగా నిరసనలను చేపడితే ప్రభుత్వం నిర్బంధాలతో అణచివేయడాన్ని నిరసిస్తూ ఆదివారం ఖేడ్‌ అంబేడ్కర్‌ చౌక్‌లో ఆయా సంఘాల ఆధ్వర్యంలో ప్లకార్డులతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు కార్మికులు, అసంఘటిత రంగ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్‌ చేశారు. ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

◆ **మంద కృష్ణ పోరాటం ప్రశంసనీయం**

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మున్సిపాలిటీ ఎమ్మార్పీఎస్‌ అధ్యక్షుడు నవీన్‌ ఆధ్వర్యంలో మందకృష్ణ మాదిగ చిత్రపటానికి ఆదివారం క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీజీఆర్‌ ట్రస్ట్‌ చైర్మన్‌ చిమ్ముల గోవర్ధన్‌ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వెనుకబడిన ఎస్సీ వర్గాల హక్కుల కోసం మందకృష్ణ మాదిగ ఎనలేని కృషి చేశారని ప్రశంసించారు. ఆయన కృషి ఫలితంగానే ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ బిల్లును ఆమోదించిందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కుమార్‌ గౌడ్‌, దేవాలయ కమిటీ అధ్యక్షుడు బాల్డ్‌ రెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు అమ్మగారి సదానంద రెడ్డి, ఎమ్మార్పీఎస్‌ నాయకులు పాల్గొన్నారు.

◆ **ఘనంగా మల్లికార్జునస్వామి జాతర**

కంది(సంగారెడ్డి): మండలంలోని జుల్కల్‌లో భ్రమరాంబ మల్లికార్జున స్వామి జాతర మహోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. జాతరలో భాగంగా ఆదివారం ఒగ్గుకథ, అగ్ని గుండాలు నిర్వహించారు. బోనాల ఊరేగింపు నిర్వహించి అమ్మవారికి బోనాలు సమర్పించారు. టీజీఐఐసీ చెర్మ్‌ పర్సన్‌ నిర్మలారెడ్డి, ఎంపీ రఘునందన్‌రావు పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు మాజీ సర్పంచ్‌ పుష్పలత విష్ణువర్ధన్‌ రెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. జాతరలో మాజీ సర్పంచ్‌లు కవిత మధుసూదన్‌ రెడ్డి, మల్లమ్మ గోపాల్‌, సొసైటీ డైరెక్టర్‌ బుచ్చయ్య యాదవ్‌, ప్రజలు పాల్గొన్నారు.